కథ

పోలీస్ కుక్కలు

బి. విద్యాసాగర్



రాత్రి రెండైంది. పొద్దున్న పేపర్ రాకముందే ఇంట్లోనుంచి స్టేషన్‌కు వెళ్ళిపోయాను. ఆరోజు పేపర్ కూడా చదవలేదు. పేపరు తీసుకుని చదువుతామని మొదటి పేజీ చదవడం ప్రారంభించానరు. టెలిఫోన్ మోగింది. ఇప్పుడే వచ్చాను ఏమైంది. ఏమైనా లా అండ్ ఆర్డర్ సమస్య అనుకుని అప్రమత్తగా ఫోను ఎత్తాను.

మాట్లాడుతున్నాను అన్నాను.

సార్ ఇంతకు ముందే నారాయణరావుగారి ఇంటినుంచి టెలిఫోన్ వచ్చింది. వాళ్లింట్లో దొంగలు పడ్డారట. దాదాపు మూడు లక్షల రూపాయల బంగారు నగలు దొంగలు ఎత్తుకుని పోరట. నైట్‌డ్యూటీ ఎస్ఐ చెప్పుకుపోయాడు.

సరే నువ్వు వెళ్లి ఇన్వెస్టిగేషన్ ప్రారంభించు. నేను తర్వాత వస్తాను అన్నాను.

'కాదు సార్ ఆయన కమిషనర్‌గార్కి కూడా ఫోన్ చేసారట. మీరు వస్తే' అని నన్ను మందలిస్తున్నట్టు చెప్పాడు- రాకుంటే బాగుండదు అన్నట్టుంది.

నాకు అర్థం అయింది. నారాయణరావుగారు చాలా పలుకుబడి వున్న మనిషి. బంజారా హిల్స్‌లో ఎకరం స్థలంలో ఇల్లు వుంది. నా కన్నా ముందే సై ఆఫీసర్లు నేరస్థలానికి వస్తారు. స్టేషన్ హౌస్ అధికారిగా నేను లేకపోతే ఎస్ఐగారి అవస్థలు- నాకు ఎస్ఐగా వున్నప్పటి అనుభవాలు గుర్తుకు వచ్చాయి. నేను మంచంలోనుంచి లేచి డ్రెస్ వేసుకుని బయటకు వచ్చేసరికి మా వాహనం రానే వచ్చింది. నారాయణరావుగారి ఇల్లు నా స్టేషన్‌లో చేస్తున్న హోమ్‌గార్డులనుంచి అందరికీ తెలుసు. నెలకు నాలుగుసార్లయినా మంత్రులు, విఐపిలు ఆ ఇంటికి వస్తారు. బందోబస్తు చేస్తూ వుంటాము.

జార్లో డ్రైవర్లు తన కుటుంబ సమస్య చెప్పడం ప్రారంభించాడు. రెండు రోజులక్రితం ఆయన సైకిలు పోయిందని, డ్యూటీకి రావడం కష్టంవుందని, బస్సులో వస్తే సరైన టయానికి డ్యూటీకి రాలేకపోతున్నానని...కొద్దిసేపు విన్నాను- సరే ఏదైనా సైకిల్ వస్తే ఇస్తాను అన్న మాటతో ఆయన చెప్పడం ఆపి లేని శక్తిని తెచ్చుకుని నేరుగా నారాయణరావుగారి ఇంటిముందు జీపు ఆపాడు. బయట రెండు మూడు కార్లు వున్నాయి. ఒకటి మా డిప్యూటీ గారిది. గుర్తించాను. మా ఎస్ఐ, ఐదారుమంది మా జవానులు, ఇంకా క్రిడ్యూటీ చేసే ఇద్దరు జవానులు రాత్రి పెట్రోలింగ్ చేసే వ్యాను వారి సిబ్బంది గేటు ముందర నిల్చున్నారు. లోనికి వెళ్ళి ముందుగా డిప్యూటీగారికి సెల్యూట్ చేసాను. తర్వాత నారాయణరావు గారికి నమస్కారం చేసాను. ఆయన ముఖంలో కోపం లైటు కాంతిలో స్పష్టంగా కనిపిస్తోంది. నన్ను కనీసం చూడలేదు, నేను కలిగించుకుని సార్ నాకు కాస్త ఆలస్యం అయింది. లేటుగా ఇంటికి పోయాను, తెలవారనే వస్తున్నాను అని వినయం ప్రదర్శించాను.. నా మాటలు వినిపించుకోలేదు. నా నటన పట్టించుకోలేదు. నా పక్కనే ఎస్ఐ నిలుచుని సార్ ఇటురండి అంటూ ఆ ఇంటి వెనకవైపు తీసుకెళ్ళాడు. వెనక వున్న కిటికీ గ్రిల్ లాగివేసి వుంది. అక్కడనుంచి పక్కనే వున్న గది తలుపులు తీసివున్నాయి. లోనికి వెళ్ళి చూసాను. వస్తువులన్నీ ఇంట్లో చిందరవందరగా పడివున్నాయి. రెండు బీరువాలు వాటి తలుపులు తెరిచి వున్నాయి.

సార్...ఈ బీరువాలో బంగారు నగలు పోయాయి. సార్ ఇంటివారు మధ్యాహ్నం ఎదో పార్టీకి పోయారట. ఇంతకు ముందే తిరిగి వచ్చి చూస్తే ఈ దొంగతనం జరిగిందని టెలిఫోన్ చేసారు. దొంగలు ఇంట్లో వాళ్ళు లేంది గుర్తించి దొంగతనం చేసారు సార్ అంటూ చెప్పుకుపోతున్నాడు.

నేరస్థలాన్ని పరిశీలించాను. దొంగలు బుద్ధి బలం, కండబలం వుపయోగించి తెలివిగా ఇంటి వెనక భాగంలో వున్న కిటికీ ఊచలు వంచి ఇంట్లోకి ప్రవేశించారు. ఇల్లంతా చిందర వందరగా వుంది. ఖరీదైన వస్తువులు బంగారం, వెండి వస్తువులు తీసుకుపోయారు. డైనింగ్ టేబుల్ మీద మూడు ఖాళీ గ్లాసులు వున్నాయి. ఇంట్లో వున్న విదేశీ మద్యం జానీ వాకర్, బ్లూలేబుల్ లాంగించేసారు. చాలా వస్తువుల మీద నేరస్థుల వేలిముద్రలు వున్నాయి.

నేను వెనక వున్న గదిలోనుంచి మధ్య హాల్లోకి రాగానే పై అధికారులు నారాయణరావు కనిపించారు. మా అధికారులకు సెల్యూట్ చేసి నిలుచున్నాను.

'ఈ ఏరియాలో పోలీసులు బీటు తిరిగిన పాపన పోరు. మొన్నే ఇంటిముందు మ్యాన్‌హోలు దొంగిలించారు. రెండు మూడు పూల కుండీలను విరగొట్టారు. మా కుక్కని రాయితో కొట్టారు' చెప్పుకుపోతున్నాడు నారాయణరావు.

నా ముఖంలో సూటిగా చూస్తు జవాబు చెప్పమన్నట్టు చూస్తున్నాడు. నేను సీలింగ్ ఫ్యాను దిక్కు చూస్తూ వుండిపోయాను.

'సార్ ఫింగర్ ప్రింట్ ఎక్స్‌పర్ట్ వాళ్ళకు చెప్పాను. పది నిముషాల్లో వస్తారు. చాలా ప్రింట్స్ నేరస్థులవి వున్నాయి' అని చెప్పాను.

నేను మాటలు పూర్తి చేయకముందే నారాయణరావు అందుకున్నాడు. 'ఏమయ్యా దొంగలు పడ్డ ఆర్నెల్లకి కుక్కలు మొరిగినట్టు అని సామెత చెప్పి నీ పోలీసు కుక్కలు ఏమయ్యాయి. వాటిని వెంటనే పిలిపించండి అని ఆలోసేషియన్ కుక్కలా అరిచాడు.

సార్ పోలీస్ డాగ్స్ రావడానికి సమయం పడుతుంది. ఇప్పుడే జీపు పంపాము అవి అంబర్‌పేటనుంచి రావాలి.

నాకు అదంతా తెలవదు. మీ కుక్కలు రావాల్సిందే, వచ్చిం తర్వాత మీరు ఇన్వెస్టిగేషన్ మొదలుపెట్టండి లేకుంటే బాగుండదు.

ఇంతలో ఫింగర్ ప్రింట్స్ వాళ్లు వాళ్ల సరంజామాతో వచ్చారు

వాళ్ళు యధావిధిగా లోనికి రాబోయారు. వీళ్ళెవరు అరిచాడు నారాయణరావు.

వీళ్లే ఫింగర్‌ప్రింట్ అధికారులు ప్రింట్స్ తీసుకుంటారు. అని వినయంగా చెప్పాను.

లేదు వాళ్ళు లోనికి రావడానికి వీల్లేదు. కావాలంటే నేను మీ పై అధికారులతో మాట్లాడతాను. నాకు కుక్కలు కావాల్సిందే అన్నాడు.

'సార్, నేరస్థులను పట్టుకోగల సమర్థులైన అధికారులు ఇక్కడ వున్నారు. ముందు మమ్మల్ని మా పనులను చేసుకోనివ్వండి' దాదాపు బతిమాలుతున్నట్టు చెప్పాను.

ఇంతలో టెలిఫోన్ మోగింది. నారాయణరావు టెలిఫోన్ ఎత్తి రెండు మాటలు మాట్లాడి నాకు టెలిఫోన్ మాట్లాడమని ఇచ్చాడు.

'ఎందుకయ్యా ఆయనతో వాదన. మీ మీద నమ్మకం లేదట. కుక్కల్ని తెప్పించరాదు' అవతలి కంఠం.

'నమస్కారం సార్. కుక్కల గురించి పంపాను. ఇంకా పది పహేను నిముషాల్లో వస్తాయి సార్'

'సరే ఆయనతో అనవసరంగా ఆర్గ్యుమెంట్ పెట్టుకోవద్దు. చెప్పిన పని చేయి' అవతల దబీలున పెట్టిన శబ్దం.

అర్థం అయిందా అన్నట్టు నా ముఖంలోకి చూసాడు నారాయణరావు.

అర్థగంట దాటింది కుక్కలు రానే వచ్చాయి. అందరం బిక్కు బిక్కుమంటూ చూస్తు వున్నాము.

కుక్కల ఇంచార్జి గారికి దొంగతనం తీరు ఎట్లా దొంగలు వచ్చారు. మొదలైనవి చెప్పాను. కుక్కల్ని చూడగానే నారాయణరావు ముఖంలో ఏదో కాంతి పోయిన వస్తువులు దొరికినంత సంతోషం కనబడింది.

కుక్కల్ని ముందు నేరస్థులు వచ్చిన గదిలోకి తీసుకుపోయే ముందు-

'రాజీ, రాణీ సెల్యూట్' అన్నారు ఇంచార్జి రెండు కుక్కలు వంగి నారాయణరావుకు సెల్యూట్ చేసాయి.

ఆయన గర్వంతో పొంగిపోయాడు.

కుక్కలకు నేరస్థులు కాలుపెట్టిన ప్రదేశం, వస్తువులు ముట్టుకున్న ప్రదేశం వాసన చూపించారు. ఆ రెండు కుక్కలు చాలాసేపు ఇంట్లో అటు ఇటు తిరిగాయి.

ఒక్కసారిగా నారాయణరావు కూర్చున్న కుర్చీ దగ్గరకు వచ్చి వెళ్ళి ఆయన్ను పట్టుకున్నాయి.

ఆయన ఒక్కసారిగా లేచి 'తరమండి...తరమండి' అరుస్తూ ముందు గదిలోనుంచి డ్రాయింగ్ రూమ్‌లోకి పరిగెత్తుతున్నాడు. ఆయన ముందు వెనకాల రెండు కుక్కలు...